# చంటాలు

లీలామహల్లో ఇంగ్లీషు పిక్చర్ చూడాలని బయల్దేరాను.

ఆదివారం పగలంతా ఇంట్లో బోర్ కొట్టి పెందరాళే వెళ్ళానేమో అక్కడ ఇంకా మ్యాట్నీ షోనే వదల్లేదు.

సిగిరెట్ వెలిగించి దమ్ము కొడుతూ రోడ్డుప్రక్కన నిల్చున్నాను. వచ్చేపోయే జనాన్ని చూస్తూ.

సుదర్శన్ హోటల్లోకి వెళ్ళబోతూ ఆగింది ఒక కారు. నల్లగా నిగ నిగలాడుతూ నీగ్రో అందగత్తెలా వుందా కారు

కారుడ్రైవరు నావంకే చూస్తున్నట్లు అనిపించింది అతనే కాదు. వెనుకసీటులో కూర్చున్న గిరజాలజుట్టు యువకుడు కూడా నావంకే చూస్తున్నాడని అనుమానము వచ్చింది.

ఆ గిరజాలజుట్టు యువకుడు కారుదిగి వచ్చాడు. కారు హోటల్లోకి వెళ్ళిపోయింది.

అతను నల్లకళ్ళజోడు తీసి నావంక చూసి నవ్వి, "ఏరా రాంబాబూ బాగున్నావా?" అన్నాడు.

అప్పుడు గుర్తుపట్టాను వాడిని.

వాడు కృష్ణమూర్తి. నా క్లాస్‌మేట్. మాకు బంధుత్వం కూడావుంది. పదేళ్ళపైనే అయింది వాడిని చూసి.

"ఎక్కడుంటున్నావ్?" అని ప్రశ్నించాడు ఆపాదమస్తకం పరీక్షగా చూస్తూ.

"రూమ్‌లో మాట్లాడుకుందాం"

"ఎక్కడ?"

"హోటల్లో."

"అదేమిటి! వూళ్ళో ఇంతమంది చుట్టాలుంటే నువ్వు వూళ్ళో కొచ్చి హోటల్లో మకాంపెట్టడం ఏమిటి?" నేను ఆశ్చర్యంగాను, నిష్ఠూరంగాను మాట్లాడాను.

వాడుమాత్రం బెల్లంకొట్టిన రాయిలా వుండిపోయాడు కాసేపు. తర్వాత నవ్వి, "హోటల్లో మాట్లాడుకుందాం పద" అని నా సమాధానము కోసం ఎదురుచూడకుండా దారితీశాడు.

నేను మారుమాట్లాడకుండా సంతలోకొన్న ఎద్దులా వాడివెంట నడిచాను.

రూమ్ లాక్ తీసి ఏ.సి ఆన్ చేశాడు.

"కూర్చో-స్నానంచేసి వస్తా" అని బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

నేను చల్లటి ఆ గదిని, అందులో అలంకరించిన ఫర్నిచర్‌నిచూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాను-

గతం గుర్తుకొచ్చింది-

అప్పుడు కృష్ణమూర్తి ఎంత దయనీయమైన స్థితిలో వున్నాడనీ, అతనికి తండ్రిలేడు, తల్లి పాలమీద, పిడకలమీద రెక్కలు ముక్కలుచేసుకునేది వీడుకూడా తల్లితోపాటే తెల్లవారుజామున నిద్రలేచి సహాయపడేవాడు, ఇంటింటికి తిరిగి పాలమ్మేవాడు. మేమిద్దరం పదోక్లాసువరకూ కలిసే చదువుకున్నాము. ఎప్పుడయినా వాళ్ళింటికి వెళ్ళాల్సివచ్చేది నోట్సులకోసం. వీడు ఎంత దరిద్రుడో అంత తెలివిగలవాడు. సరస్వతి దరిద్రుణ్ణే ఆశ్రయిస్తుందనే లోకోక్తి నిజమేనేమో?

వాళ్ళింట్లోకి వెళ్ళాలంటే అసహ్యం వేసేది. అసలే పూరిపాక. ఇంటిముందు గేదెలు, పేడకుప్పలు, పుచ్చులమడుగులు, అబ్బ ఒకటే వాసన ముక్కు మూసుకోవాలనిపించేది ఆ కాసేపు. మరి వాళ్ళు ఎప్పుడూ ఎలా వుంటున్నారో అనుకునేవాడిని అలవాటులే అని సరిపెట్టుకునేవాడిని.

పదోక్లాసులో ఉన్నప్పుడే వాళ్ళమ్మకు పక్షపాతము వచ్చింది. పాపము వాడు పరీక్షలుకూడా రాయలేకపోయాడు. మూలిగే నక్కమీద

తాటికాయ పడ్డట్లుగా వాళ్లకు పాలిచ్చే గేదెఒకటి చచ్చిపోయింది. ఆ తర్వాత వాళ్లమ్మకూడా పోయింది.

నాకు తర్వాత తెలిశాయి ఆ సంగతులు నేను పరీక్షలు కాగానే నాకి నాడ వెళ్లిపోయాను సెలవల్లో మా మేనమావగారింట్లో వుండడానికి. పరీక్ష ప్యాసైన తర్వాత ఇంటికెళ్లేసరికి కృష్ణమూర్తి తల్లి పోయినట్లు, వాడు తల్లికి జబ్బు నయంచేయించడానికి వాళ్ల బాబాయిదగ్గర తీసుకున్న డబ్బు క్రింద ఆ పూరిల్లు అమ్మేసినట్లు తెలిసింది

మరి కృష్ణమూర్తి ఏమైపోయాడో నాకు ఎవరూ చెప్పలేకపోయారు

కృష్ణమూర్తి స్నానముచేసి వచ్చాడు. బాయ్‌ని పిలిచి టిఫిన్‌కి ఆర్డర్ ఇచ్చాడు నేను వద్దంటున్నా వినలేదు వాడు.

"ఏమిట్రా సంగతులు చెప్పు" అన్నాడు నవ్వుతూ

"సంగతులు నువ్వేచెప్పాలి. నా దగ్గరేమున్నాయి ? చదువు పూర్తి చేసి బ్యాంకులో వుద్యోగము చేస్తున్నా, పెళ్లయింది. ముగ్గురు పిల్లలు, ఇద్దరు ఆడ, ఒక మగ ఇక స్టాప్" అన్నాను నవ్వుతూ.

"వెరీగుడ్!" అన్నాడు.

అప్పటి కృష్ణమూర్తికి, ఇప్పటి కృష్ణమూర్తికి ఎంతో భేదంవుంది. నేను కాబట్టి గుర్తుపట్టాను గాని, మా వూళ్ళో మరొకడయితే గుర్తు పట్టలేడు. బాగా ఒళ్లుసి ఎర్రగా నిగనిగలాడుతున్నాడు కారు మెయింటిన్ చేస్తున్నాడంటే ఏదో బిజినెస్ చేస్తుండాలి అనుకున్నాను

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్, ఏం చేస్తున్నావ్"? అంటూ కుతూహలముగా ప్రశ్నించాడు.

వాడు కలకత్తా వెళ్ళాడట, ఎవరో తెలుగాయన వెంట. ఆయనఏదో ఫ్యాక్టరీలో పని ఇప్పించాడట అందులో పనంతా నేర్చుకుని, నలుగురు పర్కర్లని కూడేసి బ్యాంక్‌లోన్ తీసుకుని స్వంత ఫ్యాక్టరీ పెట్టాడట. లాభాలు వస్తున్నాయి. బెంగాలీ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

వాళ్ళ కంపెనీ ప్రొడక్ట్సుకి డిస్ట్రిబ్యూటర్స్‌ని కలుసుకునేందుకు ఈ టూరా చ్చాడట.

కృష్ణమూర్తి చిన్నప్పుడు అనుభవించిన దరిద్రాన్ని తలుచుకొని, ఇప్పుడు సుఖపడుతున్నందుకు నాకు చాలా ఆనందము కలిగింది.

"అది సరేగాని మీ బాబాయి మున్సిపాల్టీ చైర్మన్ అయ్యాడు తెలుసా ?" అన్నాను.

"తెలీదు" అని వూరుకున్నాడు అదేమంత ముఖ్యమైన విషయము కానట్లు నిర్లిప్తత ప్రకటించాడు.

"వీడికి బంధుప్రీతి లేనట్లుందే" అనిపించింది నాకు-

"మీ బాబాయిని కలుసుకోవూ."

"ఎందుకు?" ఎదురుప్రశ్న వేశాడు.

వాడికేం సమాధానము చెప్పాలి-బంధువుల్ని ఎందుకు కలుసుకుంటారు? పదేళ్ళ తర్వాత వచ్చాడు, అదీ జీవితములో ఎంతో కష్టపడి పైకి వచ్చాడు, మేడలు కట్టించాడు కార్లలోతిరుగుతున్నాడు, అదంతాచూసి సంతోషిస్తారు గదా!

అదే అన్నాను వాడితో.

వాడు నవ్వి "సరేరా! నీ మాట ఎందుకు కాదనాలి. మా బాబాయి ఇంటికి ఇద్దరం కలిసేవెళ్దాం. ఈ సంగతి ఎవరికీ చెప్పకు. బంధువుల ఇళ్ళకి వెళ్లి సర్‌ప్రైజ్ చెయ్యాలి" అన్నాడు.

సినిమా హాల్లో గడపవలసిన సమయం కృష్ణమూర్తితో గడిచి పోయింది.

"గుడ్‌నైట్" చెప్పి హోటల్లోనుంచి బయటపడ్డాను.

* 2 *

మర్నాడు సెలవుపెట్టి ఇంట్లోనే కూర్చున్నాను. ఆ రోజంతా కృష్ణమూర్తితో గడపడానికి వీలుగా.

మా ఆవిడకు చెప్పాను ఒక స్నేహితుడు చాలాకాలం తర్వాత కలుసుకున్నాడనీ, భోజనానికి వస్తాడనీ, లంచ్‌కు ఏర్పాటు చేయమనీను.

కృష్ణమూర్తి గురించి గొప్పగా చెప్పాను.

"ఎప్పుడైనా మనం కలకత్తావెళ్తే వాడింట్లోనే మన మకాం" అని కూడా అన్నాను.

ఇంకేం మా ఆవిడ హుషారుగా ఏర్పాటు చేయసాగింది

నేను కృష్ణమూర్తి కారు హారన్ వినడానికి రెడీగా వరండాలోనే పడకకుర్చీ వేసుకున్నాను.

ఎంతకీ కారు హారన్ వినపడందే.

ఎవరి గురించైనా వెయిట్ చెయ్యడము ఒక రకమైన శిక్ష అనుభవించడం లాంటిదే అనిపించిందీ నాకు

కాలుగాలిన పిల్లిలా వరండాలోనే తిరుగుతున్నాను.

"రాంబాబూ !" అనే పిలుపువిని తలెత్తి చూసేసరికి వాడే కృష్ణమూర్తి-ఎదురుగా నిల్చొని వున్నాడు.

నేను నివ్వెరపోయాను వాడిని చూసి. కారులో రానందుకు కాదు. ఏదో నాటకములో నిరుద్యోగి వేషము వేసుకొని వచ్చినందుకు. అచ్చం ఆలాగే వున్నాడు చెరిగిపోయిన క్రాపు, చిరిగి మాసిన బట్టలు, కాళ్ళకేమో చెప్పులులేవు, చేతికి వుంగరాలు కాదుగదా వాచీకూడా లేదు.

వాడు పకపక నవ్వాడు నా కంగారు చూసి.

"ఇప్పుడు పద-మా బాబాయి యింటికి" అన్నాడు.

"ఇదేం వేషంరా?" ప్రశ్నించాను దారిలో.

"నేను ఈవూరునుంచి ఇదే వేషముతో వెళ్ళిపోయాను. ఎవరయినా నన్ను గుర్తుపట్టాలంటే ఇదేవేషం వేసుకోవాలి" అన్నాడు నవ్వుతూ.

నాకంతా అయోమయము అయిపోయింది వీడి ప్రవర్తన.

వాళ్ళబాబాయి మున్సిపల్ ఛైర్మన్ గదా! రెండంతస్తుల మేడ ఊరి మధ్యనే కట్టించాడు.

గేటు దాటేముందు అన్నాడు కృష్ణమూర్తి. "నా గురించి నువ్వేమీ మాట్లాడకు. నోరుమూసుకు కూర్చో" అన్నాడు.

నాదేం పోయింది? సరేనని గొర్రెలా తలవూపాను.

వాళ్ళ బాబాయి పేరు పాపారాయుడు ఆయన ప్రజానాయకుడు గదా- అందువల్ల ఎలాఉంటాడో మీకు చెప్పాల్సిన పనిలేదు.

కృష్ణమూర్తిని చూసి గుర్తు పట్టలేదనుకుంటాను.

"ఎవరూ?" అన్నాడు.

"నేనే బాబాయ్ కృష్ణమూర్తి"ని అన్నాడు

"నువ్వా రా మూర్తీ! బాగా మారిపోయావు. ఎక్కడుంటున్నావురా"

"కలకత్తాలో వుంటున్నాను బాబాయ్"

"అక్కడేం చేస్తున్నావు?"

"ఫ్యాక్టరీలో వెల్డరుగా చేస్తున్నాను. వర్కర్లు సమ్మెచేశారు. ఫ్యాక్టరీ మూతపడింది. రెండునెల్లుగా ఎక్కడా పనిలేదు

"సమ్మెచేసే ఫ్యాక్టరీలు చేస్తారు? ఎంత జీతాలు పెంచినా తృప్తి లేదు పనివాళ్ళకి. ఇంగ్లీషోడున్నప్పుడల్లా వుండేదా! సమ్మె గిమ్మె అంటే తోలువలిచి పారేసేవాడు మనవాళ్ళంటే లెక్కలేదు మనవాళ్ళకి. ప్రతిదానికి సమ్మెలే.

ఉపన్యాసము చెప్పే ధోరణిలో పడిపొయ్యాడు.

"నువ్వు ఛైర్మన్ అయ్యావని తెలిసి ఈ ఊరొచ్చాను బాబాయ్ ఏదయినా పని ఇప్పించకపోతావా అని."

"ఏం పనులు వున్నాయిరా! ఎమ్.ఏ.లు, బి.ఏ.లు చదివినవాళ్ళే రిక్షా లాగుతున్నారు. ఇక నీబోటివాడికి ఏంపని దొరుకుతుంది ?"

"అదికాదు బాబాయ్! ఏదయినా ఫరవాలేదు" అంటూ చాలాసేపు బ్రతిమలాడాడు కృష్ణమూర్తి.

ఇదంతా నిల్చునే. మమ్మల్ని కూర్చోమని కూడా అనలేదు ఛైర్మన్ గారు.

ఇక కాఫీలు, మర్యాదలు కూడానా!

అఖరికి అడ్రసు ఇచ్చిపోరా ఏదయినా ఛాన్సువుంటే కార్డు రాసి పడేస్తా" అని హామీ మాత్రము ఇచ్చాడు.

కృష్ణమూర్తి ఇంట్లోకివెళ్లి వాళ్లపిన్నిని పలకరించి వచ్చాడు. అవిడ నాలుగు పొడిపొడి మాటలు మాట్లాడి పంపేసింది.

తల్లి పోతే తండ్రే పినతండ్రితో సమానం అంటారు పెద్దలు. ఇక అసలు పినతండ్రి, ఆయన భార్యగురించి చెప్పుకోవడం ఎందుకు?

[చైర్మన్‌గారింటిలో నుంచి బయటపడిన తర్వాత ఇద్దరు, ముగ్గురు దగ్గరి బంధువుల ఇళ్లకివెళ్లాం, అందులో ఒకళ్ళు మాత్రము నా ముఖము చూసి కాఫీఇచ్చారు. కృష్ణమూర్తితో మాట్లాడటం కూడా ఏదో మొక్కు తీర్చుకున్నట్లుగానే.

"చూశావురా రాంబాబూ! నేనెందుకు హోటల్లో దిగానో అర్థమైందా అన్నాడు

తలవూపాను,

"ఈ చుట్టాలు మనిషికి కాదురా! డబ్బుకి, కార్లకి, మేడలకి, అధికారానికి చుట్టాలు. అవేమీ లేదని తెలిస్తే ఎలాచూస్తారో చూశావుగా! ఇప్పుడు చెప్పు నాకు చుట్టాలు ఎవరో" అన్నాడు వుద్వేగముతో

నేనేం సమాధానము చెప్పను వాడికి? వాడు జీవితాన్ని కాచి వడపోసినవాడు, నా జీవితము వడ్డించిన విస్తరిలాంటిది.

"సరే! అదంతా పోనీ, మా ఇంటికి రా పోదాం, భోజనం వేళయింది" అన్నాడు-

"ఈ అవతారముతో వస్తే మీ అవిడ భోజనము పెడుతుందా ? రూమ్‌కి వెళ్లి బట్టలు మార్చుకుని వెళ్దాం" అన్నాడు నవ్వుతూ.

నవ్వుతూనే అన్నా వాడిమాటలు నాకు కరెంట్ షాక్‌లా తగిలాయి, నిజమేమరి, నిజం షాక్‌లాగే తగులుతుంది-

కృష్ణమూర్తిని ఇలాగే తీసుకెళ్తే "వీడెవడండీ తద్దినం" అని మా అవిడ గొణుక్కోవడము ఖాయము, రాత్రి చెప్పింది వీడిగురించే అనిఎంత చెప్పినా నమ్ముతుందా? నమ్మదుగాక నమ్మదు. *

ప్రచురణ : విజయ మాసపత్రిక, డిసెంబరు, 1980